# 12. తప్పట్లు

ఉదయం ఏడు గంటలయింది.

దుర్గారావు స్కూటర్ బయటకు తీసాడు. చినబాబు గారింటికి బయలుదేరాడు. స్కూటర్ స్పీడ్‌గా నడుపుతున్నాడు.

దుర్గారావుకి వూరంతా కొత్తగా కనబడుతోంది. రోడ్లను శుభ్రంగా తుడుస్తున్నారు. రోడ్ల మీద, రంగు కాగితాలతో తోరణాలు కడుతున్నారు. ఎత్తుగా ఆహ్వాన పతకాలు వేలాడ కడుతున్నారు. పార్కులో వేదికను ఎత్తుగా నిర్మించి, హుందాగా అలంకరిస్తున్నారు. రోడ్లకి రెండువేపులా, డి.డి.టి. పొడరు జల్లుతున్నారు.

కొత్త కొత్తగా, రంగు రంగులుగా, కనబడుతున్న రోడ్లను చూసుగుంటూ, కూని రాగం తీస్తూ, హుషారుగా, జోరుగా పోతున్నాడు.

ఒక మంగలాడు పొదిని పట్టుకుని, జోరు జోరుగా వస్తున్నాడు. దుర్గారావు స్కూటర్ ఠక్కున ఆపాడు. ఠక్కున మంగలాణ్ని ఆపాడు.

'ఏట్రా, మంత్రీ! మన ముసిలి నగరాన్ని ముస్తాబు చేస్తున్నారు?!'

'నీకు తెల్దేటండీ! మంత్రిగా రొస్తున్నారు!'

ఆ మంత్రి అలా చెప్పి, పొదిని వూపు గుంటూ, వడివడిగా వెళ్లిపోయాడు.

దుర్గారావు స్కూటర్ స్టార్టు చేసి, స్పీడ్‌గా వెళుతున్నాడు. కొంత దూరం వెళ్లాడు.

రోడ్డుకి అడ్డుగా, కొంత మంది నిలబడి, అరుచుకుంటూ, కేకలేసుగుంటూ, మాట్లాడు కుంటున్నారు.

దుర్గారావు ఠక్కున స్కూటర్ ఆపాడు. జేబులోంచి చుట్ట తీసి ముట్టించాడు. చుట్ట కాలుస్తూ, మొహం ఎత్తి వాళ్లని చూస్తూ, వాళ్ల మాటలు వింటున్నాడు. మరి కొన్ని స్కూటర్లు, సైకిళ్లూ, రిక్షాలే గాకుండా, జనాలు గూడ ఆగిపోయారు.

' – – – ఇయ్యాల ఒక్క రోజుకేనట్రా! పందుల్నీ, గాడిదల్నీ దొడ్డుల్లో ఎట్టండట్రా! జనాల మీదికి ఒగ్గీకండి! ఇయ్యాల మంత్రి గారొస్తున్నారు! ఎల్లండి, ఎల్లండి! తలకోటి ఏడేడి టీ తాగేసి, తలో సుట్ట ముక్కా తీసుగుని, ఇయ్యాల్టికి ఆటిని దొడ్డుల్లో ఎట్టండి! రోడ్డు మీదకి ఒగ్గీకండి! పోలీసోళ్లయితే నిన్నిరేత్తిరే కొందర్ని దొడ్డిలో ఎట్టేసినారు! రేపు ఒగ్గేస్తారు! మీరూ ఒగ్గేయండి! – – '. కొందరు కార్యకర్తలు సూ కర గాడి భాధిపతులకు నచ్చ జెప్పి, డబ్బులిచ్చి, రోడ్డు ఖాళీ చేసి, పక్కకు వెళ్ళారు. జనాలు రోడ్డు మీంచి పక్కకు తప్పుగున్నారు.

దుర్గారావు స్కూటర్ స్టార్టు చేసాడు. కొంత దూరం వెళ్లాడు.

జనాలు గుంపులు గుంపులుగా రోడ్డు మీద నిలబడ్డారు. ముందుకి వెళ్లడానికి దారిలేదు. ఠక్కున స్కూటర్ ఆపాడు. చుట్ట ముట్టించి. పొగ వొదుల్తూ, జనాన్ని చూస్తున్నాడు.

రోడ్డు మీద పోతున్న ఖాళీ లారీలు ఆపేస్తున్నారు. ఆ లారీల్ని పక్క రోడ్డుకి మళ్లించి, నిలిపేస్తున్నారు.

'. . . ఇయ్యాల మద్దేన్నం, ఒకొక్క లారీ ఒక్కొక్క వూరెల్లి జనాన్ని తోలుకు రావాలి! మర్యాదాగా ఒప్పుకోండి! మాం గౌరవంగా సెబుతున్నాం! నేక పోతే, మీ బళ్లు దెబ్బతినేస్తయ్! టైర్లు ముక్కలయి పోతాయ్! మాం పోకిరీ గోళ్లం గాదు! మాం డబ్బు లిచ్చుగుంటాం! ఆ టీ కొట్లో కెల్లి, ఏడేడి టీ తావుతూ, సల్లగా గూకోండి! టైమయ్యాక, మాం పిలుస్తాం! పెజలు బాగుపడాలంటే మనం కొంచెం కష్ట పడాలని మీకు తెలుసు! లారీ డ్రైవర్లు మమ్మల్ని ఛమించాలి! ఇది మాకోసం కాదు! పెజల కోసమే! మనందరి కోసమే! . . .' అలా కొందరు, లారీ డ్రైవర్లకు, ఉపన్యాసాలిస్తున్నారు.

కొంత సేపు ఆగాక, ఆ మాటలు వింటూ, జనం మద్దిలోంచి స్కూటరు నడుపు గుంటూ, దుర్గారావు ముందుకి నడిచాడు. స్కూటర్ స్టార్ట్ చేసి, వేగంగా, చినబాబు గారి ఇల్లు చేరుకున్నాడు.

* * *

చినబాబుగారి ఇల్లు చిన్నది కాదు. అదొక విశాలమైన భవనం. ఆ భవనం విశాలంగా వుండడమే గాకుండా, మూడంతస్తులతో, ఎత్తుగా, హుందాగా వుంది. ఆ భవనం చుట్టూ ఎత్తయిన ప్రహారీ గోడ వుంది.

ఆ ప్రహారీ గోడలోపున రకరకాల పూల మొక్కలున్నాయ్. పచ్చ పచ్చగా కిలకిల నవ్వుతూ, ఆ మొక్కలు రంగు రంగు పువ్వుల్తో, యవ్వనంగా వున్నాయ్. యవ్వనంగా వున్న ఆ మొక్కలు సరసంగా వున్నాయ్. సరసంగా వున్న ఆ మొక్కలు, నవ్వుతూ పలకరిస్తాయ్. పలకరిస్తూ,నవ్వుతాయ్. వూగుతూ పాడుతాయ్.

ఆ భవనం ఆ మొక్కల్లో చల్లగా వుంది. ఆ పువ్వుల్లో అందంగా వుంది. ఆ పువ్వుల నవ్వుల్లో పరవశంగా వుంది. ఆ పువ్వుల సంగీతంలో మత్తుగా వుంది.

చీకటి రాత్రిలో ఆ భవనం, వెన్నెల్లో వున్నట్లు వుంటుంది. వెన్నెల రాత్రిలో ఆ భవనం, పున్నమి వెన్నెల్లో వున్నట్లు వుంటుంది.

* * *

ఆ భవనంలో వుంటున్న చినబాబుని, చినబాబని పిల్చినా, అతడు పెదబాబే అని అందరికీ తెలుసు. చినబాబు, పెదబాబే గానీ, చినబాబు కాజాలడని అందరికీ తెలుసు. చిన బాబు, పెద బాబే గాకుండా, రాజకీయ రంగంలో రాజు లాంటివాడని జనం అంటారు. ప్రజల మాటలు పట్టించుగున్న వాడు, ప్రజా నాయకుడు కాజాలడని, ఆ రాజు లాంటి చినబాబు, చిన్న

ప్పుడే తెలుసుగున్నాడని, కొందరు పెదబాబు లంటారు. అంతే గాకుండా – ఎవరు రాజ్యమేలినా - ఎవరెవరు ఎలా రాజ్యమేలినా - పదవుల కోర్కెలే గాని ప్రజల కోర్కెలు తీరవని గిట్టనివాళ్లు చెప్పిన మాటలు విని, చెడిపోకూడదని చినబాబు చిన్నప్పుడే తెలుసుకున్నాడని, చినబాబులు గాని పెదబాబులు కొంద రంటారు.

* * *

రోజూ తొమ్మిది గంటలకు లేచే అలాంటి చినబాబు ఆ రోజు ఆరు గంటలకే లేచి పోయాడు.

హాల్లో కూర్చున్నాడు.

ఎందరెందరో జనాలు వస్తున్నారు. వాళ్లల్లో ప్రముఖులున్నారు. ప్రముఖుల్లో ప్రముఖులున్నారు.

ప్రముఖులు కాని వాళ్లున్నారు. ప్రముఖులు కాని పనికిరాని వాళ్లున్నారు. సామాన్యులున్నారు. అలగా జనం వున్నారు. అలాగే – అలాగే ఎందరెందరో వున్నారు.

దండాలు పెట్టే వాళ్లే గాకుండా, దండాలు పెట్టించుగునే పెద్దలు గూడా వున్నారు.

అలా వచ్చినవాళ్లల్లో దుర్గారావు కూడా వున్నాడు. అయితే - దుర్గారావెందుకొచ్చాడో,దుర్గారావు క్కూడా తెలీదు.

* * *

దుర్గారావు నల్లగా, సన్నంగా, పొడుగ్గా వుంటాడు. కాకీ ఆఫ్ పాంటే గానీ మరోటి వేసుకోడు. పొడవు చేతుల తెల్ల చొక్కా తప్ప మరోటి తొడగడు. నల్ల చెప్పులే గానీ మరో రంగు చెప్పులు వేసుగోడు.

అందరికీ అందరూ ఒహలా కనబడ్డు గాబట్టి, కంట్రాక్టరు దుర్గారావు అందరికీ ఒహలా కనబడ్డు. అతడు కూలీ జనాలకి పోలీసులా కనబడతాడు. అప్పులు చేసి ఇళ్లు కట్టే చిన్న ఉద్యోగులకి బాధ బాధగా కనబడతాడు. అప్పులు చేయకుండా ఇళ్లు కట్టే పెద్ద వుద్యోగులకి బాధగా వుంటాడు. అయితే - మునిసిపల్ ఆఫీసు వాళ్లకి మహాత్ముళ్లా కనబడతాడు.

అయితే, చినబాబుకి, దుర్గారావు ఎలా కనబడతాడో అన్నది, చినబాబుకే గానీ దుర్గారావుకి తెలీదు.

దండం పెడుతూ నిలబడ్డ దుర్గారావు, నిలబడే వున్నాడు గానీ, కూర్చోలేదు.

దుర్గారావు వినయ పూర్వకంగా నమస్కారం విసిరినప్పుడు, చినబాబు చిద్విలాసంగా చిరునవ్వు విసిరాడు. చినబాబు, దుర్గారావుకి ఏం చెప్పాడో, దుర్గారావు మాత్రమే విన్నాడు. దుర్గారావు, చినబాబుకి ఏం మనవి చేసాడో, చినబాబు మాత్రమే విన్నాడు.

దుర్గారావు చేతులు జోడించి , మళ్లీ దండం పెట్టాడు. దండం పెడుతూ పెడుతూ, జేబు సర్దుగుంటూ, దుర్గారావు వెళ్లి పోయాడు.

* * *

మూడు గంటలయింది.

సూర్యుడు సూర్యుడే గానీ చంద్రుడు కాజాలడు గాబట్టి, సూర్యుడు సూర్యుళ్లా భగ్గున మండుతున్నాడే గానీ చంద్రుళ్లా చల్లగా లేడు.

ఆ ఎండలో దుర్గారావు గాలిలా వచ్చాడు.

రోడ్డు వేస్తున్న కూలీలే గాకుండా, ఇల్లు కడుతున్న కూలీలు కూడా, దుర్గారావుని చూసి, నోరిప్పకుండా, గబగబా - హడావుడిగా - పని చేస్తున్నారు.

'- - ఓరి సత్తెం ! నాను టీ కొట్టు కాడుంటాను. పని కట్టించెయ్! అందర్నీ అక్కడికి రమ్మని సెప్పు!. .. .' అలా కేకేసి, దుర్గారావు టీ కొట్టు చేరుకున్నాడు.

'.. రోజూ సీకటడ్డా పోనీడు! ఇయాల ఈడికేటి రోగ వొచ్చిందో! పన్నే దని తవిలేస్తడేటో! . .' అలజడిగా కూలీజనాలు, బతుకు బితుకుగా అనుకుంటున్నారు.

దుర్గారావు టీ కొట్టు ముందు రాతి మీద కూర్చున్నాడు.

కూలీ జనం అతడి ముందు అలజడిగా నిలబడ్డారు. ' - - ఏడేడి టీ తలకోటీ మా వోళ్లకి బేగియ్యరా . . . .' అని దుర్గారావు టీలకి ఆర్డరిచ్చాడు.

అలజడి ఆగిపోయి, నవ్వులు మొదలయ్యాయ్. ' - - - దుర్గారావుకి మరో కొడుకు పుట్టాడో, ఏటో?! నేదురా, మరో రోడ్డు పని దొరికుంటాది! కాదురా, కూతురికి పెల్లి కుదిరుంటాది! .. నేదురా, నాటరీ పలికేసుంటాది! అలా కాదు రోరి, పెద్ద కంటురాట్టు దొరికేసుంటాది! - - వేడి వేడి టీ తాగుతూ, నవ్వుతూ, కూలీ జనం దుర్గారావుని కవ్విస్తున్నారు.

పువ్వుల కవిత్వం వుందనీ పెళ్లాన్ని ఎవడూ వొగ్గీడని, దుర్గారావు అనుకున్నాడో, లేదో, తెలీదు గానీ అతడు మాత్రం ఏమీ మాట్లాడలేదు.

'ఓరి సత్తెం! నాను పార్కు గేటు కాడుంటాను. అక్కిడికి అందరూ బేగి రండి! . . ' దుర్గారావు అలాకేక వేసి, స్కూటరెక్కి వెళ్లిపోయాడు.

* * *

సాయంకాలమవుతోంది. ఎండ కొద్దిగా కాస్తోంది. పార్కు జనాలతో కిక్కిరిసి పోతోంది. పార్కు ముందు రోడ్లు జనాలతో నిండి పోయాయ్.

రంగు కాగితాల తోరణాలు గాలిలో రెప రెప లాడుతున్నాయ్. ఆహ్వాన పతాకాలు గాలిలో గర్వంగా ఎగురుతున్నాయ్.

మంత్రి గారొచ్చేసారు. మంత్రి గారితో పాటు మరో మంత్రి గారు – అంతే గాకుండా చినబాబు గారు - అంతేగాకుండా పార్ల మెంటు సభ్యుడు - అంతే గాకుండా అసెంబ్లీ సభ్యుడు - అంతే గాకుండా పుర ప్రముఖులు కూడా వచ్చేసారు.

జనాలు సంతోషంతో ఆహ్వాన నినాదాలు చేస్తున్నారు. పూల దండలతో ప్రముఖులు మంత్రి గారిని అలంకరిస్తున్నారు.

మంత్రి గారు చిరునవ్వులు జనాల మీద వర్షిస్తూ, వేదిక ఎక్కారు. జనాలకు వినయంతో నమస్కరిస్తూ ప్రసంగం ప్రారంభించారు. జన సముదాయాన్ని చూసి, విజయానందం పొందుతూ, ఉత్తేజంగా ప్రసంగిస్తున్నారు. ప్రతి మాటకూ జనాలు హర్ష నినాదాలు చేస్తూ, తప్పట్లు కొడుతున్నారు. పార్కు తప్పట్లతో దద్దరిల్లి పోతోంది. అలా సంతోషంతో - ఉద్రిక్తతతో - ఉత్సాంతో - ఉత్తేజంతో సభ జరుగుతోంది

* * *

సభ ముగిసింది. మంత్రి గారూ – ప్రముఖులూ జనాల మీద చిరునవ్వులు కురిపిస్తూ వెళ్లిపోయారు. జనాలు ఎవరి దారి వాళ్లు పట్టేసారు. దుర్గారావు స్కూటరు మీద కొంత దూరం వెళ్లి, చిట్టెమ్మ సారా కొట్టు దగ్గర ఆగిపోయాడు. చిట్టెమ్మ సారా కొట్టు సందడిగా వుంది. జనాలతో నిండి పోయింది. సారా కొట్టు ముందున్న పది బెంచీల మీదా జనాలు సారా గ్లాసులు పట్టుగుని కిక్కిరిసి పోతూ కూర్చున్నారు.

చిట్టెమ్మ దుర్గారావుని చూసి, చిరునవ్వు విసిరేసింది. చిన్న బల్ల తెచ్చి, బెంచీల మధ్దిన వేసింది. దుర్గారావొచ్చి కూర్చున్నాడు.

జనాలు సారా గ్లాసులు ఖాళీ చేస్తూ, మంత్రి గారేం చెప్పారో - చినబాబు గారేం చెప్పారో – ఎవరెవరు ఏవేమి చెప్పారో - చెప్పుగుంటున్నారు. నవ్వుకుంటున్నారు. అంతే గాకుండా, వాదించుగుంటున్నారు. అంతే గాకుండా, కేకలేసుగుంటున్నారు.

దుర్గారావు తూలుతూ కూర్చున్నాడు.

'ఒరి దుర్గా, నువ్వేటి ఇన్నావో సెప్పరా! ' చాలా మంది జనం దుర్గారావు వేపు చూస్తూ అడిగారు. '– – తప్పట్లు – – ' దుర్గారావు తప్పట్లు కొడుతూ చెప్పాడు. జనం అందరూ, పకపక విరగబడి నవ్వుతున్నారు. దుర్గారావు తప్పట్లు కొడుతూ, కోపంగా చూస్తున్నాడు. ' నాను ఇన్నవే మీరు ఇన్నారు! మీరిన్నవే నానూ ఇన్నాను. ! తప్పట్లు గాక మరేటి ఇన్నార్రా! ఎందుకురా నవ్వు తున్నారు. మతిసెడి పోయిందిరా మీకు! ఇన్నది ఇన్నట్లు సెప్పండర్రా! తాగేసి, వొళ్లు తెలీకుండా, బొల్లి కబుర్లు ఎందుకురా సెప్తున్నారు! నాను జివ్వడి పోయినా, అబద్దం చెప్పను! పొగరెక్కి పోయి - మతి పోయి - నవ్వుతున్నారు. ! తప్పట్లు – – తప్పట్లు - - తప్పట్లు – –' దుర్గారావు లేచి నిలబడి పోయి కేకలు వేస్తున్నాడు. జనాలు నవ్వుతున్నారు.

'– – ఓనా పిట్టా – –'

'– – ఓసిట్టీ, - - ఓనా పిట్టా - - - నువ్వే టిన్నావో సెప్పు ! - -' తూలి పోతూ దుర్గారావు చిట్టెమ్మను అడిగాడు.

చిట్టెమ్మ ఏమీ చెప్పలేదు!

తప్పట్లు కొట్టింది! ఆ తర్వాత రెండు గ్లాసుల సారా రెండు చేతుల్తో పట్టుకుంది. దుర్గారావు దగ్గరకు వెళ్లింది. ఆతడ్ని బెంచీ మీద కూర్చోబెట్టింది. ఒక గ్లాసు సారా అందించింది. ఖాళీ చెయ్యి అతడి తల మీద వేసింది. వేళ్లను జుత్తు లోకి పోనిచ్చి నిమురుతోంది. ఒక నిమిషం పోయాక రెండో గ్లాసు అందించింది. తప్పట్లు కొడుతూ సారా కొట్లోకి వెళ్లిపోయింది.

జనవందరూ తప్పట్లు కొడుతూ, విరగబడి నవ్వుతున్నారు. విరగబడి నవ్వుతూ, తప్పట్లు కొడుతున్నారు.

తప్పట్లు ! – – తప్పట్లు! - - తప్పట్లు!

సారా కొట్టు తప్పట్లతో దద్దరిల్లి పోతోంది.

(వివరాలు దొరకలేదు)